క్లుప్తంగా

అడవులను సంరక్షించుకోవాలి



మాట్లాడుతున్న డీఆర్‌ఓ రాజశేఖర్ గౌడ్

మర్రిపాడు: మండలంలోని అడవులు, అడవుల్లోని వన్యప్రాణులు, ఎర్రచందనాన్ని సంరక్షించుకోవాలని వెంకటాపురం సెక్షన్ డిప్యూటీ రేంజ్ అధికారి రాజశేఖర్‌గౌడ్ తెలిపారు. మండలంలోని వెంకటాపురంలో మంగళవారం అటవీ సంరక్షణపై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం డాక్టర్ గోపినాథ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు శివకుమార్, సంపత్, సాయికృష్ణ, వైద్యసిబ్బంది సైదా, అంకిరెడ్డి, ఫర్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ రమణయ్య, వన సంరక్షణ సమితి చైర్మన్ పుల్లయ్య పాల్గొన్నారు.

అటవీ సంరక్షణ అందరి బాధ్యత

సోమశిల: అడవులను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అనంతసాగరం డీఆర్‌ఓ ఖాజారంతుల్లా తెలిపారు. మంగళవారం మండలంలోని యాకర్లపాడులో అటవీశాఖ ఆధ్వర్యంలో వన్యప్రాణి, ఎర్రచందనం సంరక్షణపై గ్రామస్తులకు అవగాహన నిర్వహించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ అడవుల్లో వృక్ష సంపదను కాపాడేలా ప్రజలు దృష్టి సారించాలని కోరారు. ఈ సందర్భంగా వైద్యశిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్యాడ్లు, నోటు పుస్తకాలు అందజేశారు. బీట్ ఆఫీసర్లు నరసింహులు, వరప్రసాద్, సర్పంచ్ నరసింహరాజు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థుల బెస్ట్ ఫెర్ఫార్మెన్స్



బెస్ట్ ఫెర్ఫార్మెన్స్ అవార్డు అందుకుంటున్న గైడ్ టీచర్ హేప్సీ సైమన్, విద్యార్థినులు

కావలి: విద్యార్థుల్లో నిబిడీకృతమై ఉన్న సృజనాత్మకతో కూడిన నైపుణ్యాన్ని వ్యాపార నైపుణ్యంగా పెంపొందించడానికి, వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో విజయవాడలో మంగళవారం జరిగిన ఎంటర్‌ప్రెన్యూర్ మైండ్ సెట్ డెవలెప్‌మెంట్ ప్రోగ్రాంలో కావలికి చెందిన కస్తూర్బా బాలిక విద్యాలయం (కేజీబీవీ) విద్యార్థులు బెస్ట్ ఫెర్ఫార్మెన్స్ అవార్డు సాధించారు. ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ), సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కావలి కేజీబీవీ గైడ్ టీచర్ హేప్సీ సైమన్, విద్యార్థినులు బి.పద్మజ, జి.ప్రసన్న, పి.మనస్విని పాల్గొన్నారు. రీసైక్లింగ్ పేపర్ అండ్ క్రాఫ్ట్ ప్రాజెక్ట్ విభాగంలో బెస్ట్ ఫెర్ఫార్మెన్స్ అవార్డును సాధించారు.

ఎస్సీ వర్గీకరణ చేయండి

ఆత్మకూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదిస్తామని హామీ ఇచ్చిందని, అయితే మాట తప్పడంతో ఆ ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ సూచనలతో పాదయాత్ర, కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆత్మకూరు ఎంఆర్‌పీఎస్ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో అల్లీపురం వద్ద ప్రవేశించింది. మున్సిపల్ బస్టాండ్ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. 31వ తేదీ కలెక్టరేట్ ముట్టడి చేపట్టనున్నట్లు తెలిపారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు డి.మహేష్, ఎస్ హజరత్, మహిళా నాయకులు గంగపట్ల లక్ష్మమ్మ, సుజాత, వెంకట నరసయ్య పాల్గొన్నారు.

కుట్టుమెషిన్ల వితరణ

ఉదయగిరి: మండలంలోని అప్పసముద్రం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు మంగళవారం నాలుగు కుట్టుమెషిన్లను అందజేశారు. చౌటపల్లికి చెందిన చేజర్ల వెంకట్రామిరెడ్డి, రామిరెడ్డి జయచంద్రారెడ్డి రూ.20 వేలు, ఏఎస్‌ఎం పద్మావతి రూ.6 వేలు అందజేయడంతో 4 కుట్టుమెషిన్లు కొనుగోలు చేసి పాఠశాలకు అందించారు. విద్యార్థినులు విద్యతోపాటు కుట్టులో నైపుణ్యం సాధించాలనే ఉద్దేశంతో ఈ మెషిన్లు అందించినట్లు తెలిపారు.

స్వయం ఉపాధికి చేయూత

వింజమూరు: స్వయం ఉపాధికి కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ చేయూతనందిస్తుందని ట్రస్ట్ చైర్మన్ కాకర్ల సురేష్ అన్నారు. మండలంలోని బొమ్మరాజుచెరువులో కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో 20 మందికి మంగళవారం తోపుడు బండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వెంకటసుబ్బయ్య, ఖాజావలి, కేవీ రత్నం, చల్లా శ్రీనివాసులు తదితరులున్నారు.

పీహెచ్‌సీ తనిఖీ



సంగం: సంగం పీహెచ్‌సీని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రికార్డులు పరిశీలించి ఓపీపై డాక్టర్ ప్రతిమను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పక్క రాష్ట్రాల్లో కోవిడ్ కేసులు పెరుగుతున్న దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైందన్నారు. హెచ్3ఎన్2పై ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వైద్య సిబ్బంది, జూనియర్ డాక్టర్లు పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- మాట తప్పని, మడమ తిప్పని నైజం జగనన్నది
- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి
- డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ



మూడో విడత వైఎస్సార్ ఆసరా చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

అల్లూరు: రాష్ట్రంలో అక్క, చెల్లెమ్మల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి జగనన్న ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో మూడో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత పొదుపు మహిళలతో కలిసి సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాట తప్పని మడమ తిప్పని నైజం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదని చెప్పారు. అల్లూరు మండలంలో మూడో విడతలో 785 సంఘాల్లోని 7,902 మంది సభ్యులకు రూ.5.71 కోట్ల వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా అక్కచెల్లెమ్మల ఖాతాల్లో సీఎం జమ చేశారన్నారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తోందన్నారు. ఒకప్పుడు వైఎస్సార్, ఇప్పుడు ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అన్ని విధాలా అగ్రపీటం వేశారన్నారు. రాజకీయ ప్రాధాన్యం నుంచి అన్ని పథకాలు మహిళలకే అందేలా సీఎం తీసుకున్న నిర్ణయం ఆదర్శంగా నిలుస్తోందన్నారు. 2014లో చంద్రబాబు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి మహిళలను మోసం చేశారన్నారు. సీఎం జగన్ మాత్రం ఇచ్చిన మాట ప్రకారం క్రమం తప్పకుండా మూడో విడతగా వైఎస్సార్ ఆసరా అందిస్తున్నారన్నారు. ప్రజాసంక్షేమం కోసం పరితపిస్తున్న జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామన్నారు. గత ప్రభుత్వ హయాంలో అల్లూరు ప్రభుత్వాస్పత్రిలో డాక్టర్లు సిబ్బంది లేని పరిస్థితి ఉండేదని, జగనన్న ప్రభుత్వం వచ్చాక ఇప్పుడు పూర్తిస్థాయిలో డాక్టర్లు సిబ్బంది ఉండడంతో ఎంతో మంది పేద ప్రజలకు ఉచిత వైద్యం అందుతుందన్నారు. ముఖ్యంగా నెలకు 15–30 మధ్య కాన్పులు జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా ఆసరా పొందిన మహిళలు మాట్లాడుతూ ఈ సారి కూడా జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుని తీరుతామని, ఆయన ముఖ్యమంత్రిగా ఉంటేనే మహిళలకు ఆర్థిక భరోసా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, ఆర్డీఓ శీనానాయక్, ఎంపీడీఓ శ్రీదేవి, కమిషనర్ ఫణికుమార్, జెడ్పీటీసీ వేణమ్మ, ఎంపీపీ శిరీష, ఏఎంసీ వైస్ చైర్మన్ ఊటు శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు దండా కృష్ణారెడ్డి, బీద రమేష్, షేక్ ఉస్మాన్, నిమ్మల భాస్కర్, తాండ్ర మల్లీ, దాసరి మల్లీ, బత్తల సుధ, చెంతాటి శీనయ్య, కరుణాకర్, దాసరి పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలి

- ఆర్డీఓ వీకే శీనానాయక్



బోగోలులోని లేఅవుట్‌లో గృహనిర్మాణాలు పరిశీలిస్తున్న ఆర్డీఓ వీకే శీనానాయక్

బిట్రగుంట: బోగోలు మండలంలో జరుగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేలా సర్వే సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టాలని కావలి ఆర్డీఓ వీకే శీనానాయక్ అన్నారు. ఎస్వీపాళెంలో జరుగుతున్న రీసర్వే ప్రక్రియను ఆర్డీఓ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వే జరుగుతున్న విధానాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సర్వే ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేస్తే ప్రభుత్వమే ఖర్చులన్నీ భరించి రైతుల భూములకు హద్దు రాళ్లు ఏర్పాటు చేస్తుందన్నారు. అనంతరం బోగోలులోని జగనన్న లేఅవుట్‌లలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. వివిధ దశల్లో ఉన్న గృహ నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో చర్చించారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు ఏప్రిల్ 15 నాటికి నిర్మాణాలు పూర్తి చేసేలా ప్రత్యేకాధికారులు చొరవ చూపాలని సూచించారు. నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేలా లబ్ధిదారులకు అవగాహన కలిగించడంతో పాటు నిర్మాణాలు స్వయంగా పర్యవేక్షించాలన్నారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ గోవిందరావు, రెవెన్యూ, గృహనిర్మాణశాఖ సిబ్బంది ఉన్నారు.

నేటి నుంచి గడపగడపకు మన ప్రభుత్వం

చేజర్ల: మండలంలోని ఆదూరుపల్లి సచివాలయ పరిధిలో ఈ నెల 29, 30 తేదీల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ విజయలలిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి హాజరవుతారని ఆమె తెలిపారు. బుధవారం సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆదూరుపల్లి సచివాలయ పరిధిలో, గురువారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి ఆదూరుపల్లి సచివాలయ పరిధిలోనే కొనసాగుతుందన్నారు. ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అధికారులు హాజరుకావాలని ఆమె కోరారు.

ఆసరా చెక్కుల పంపిణీ

మూడో విడతలో పొదుపు సంఘాల మహిళలకు ఆసరా చెక్కులను బుధవారం ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పంపిణీ చేస్తారు. ఈ కార్యక్రమం చేజర్లలోని ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో జరుగుతోంది.

పౌర హక్కులను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

- ట్రెయినీ కలెక్టర్ విద్యాధరి



మాట్లాడుతున్న తహసీల్దార్ పద్మావతి

జలదంకి: పౌరులకు ప్రభుత్వం కల్పిస్తున్న హక్కులు, చట్టాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ట్రెయినీ కలెక్టర్ విద్యాధరి తెలిపారు. మంగళవారం బ్రాహ్మణక్రాక గిరిజన కాలనీలో సివిల్ రైట్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక గిరిజనులకు ప్రభుత్వం కల్పిస్తున్న హక్కులు, చట్టాలను వివరించారు. గిరిజనులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, రుణాలను వారికి తెలియజేశారు. గిరిజన కుటుంబాలను ఎవరైనా నిర్బంధించినా, బెదిరింపులకు పాల్పడినా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కాలనీలో వారికి మౌలిక వసతులు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు లేవని, కాలనీ ఇళ్లు శిథిలావస్థకు చేరాయని అధికారులకు వివరించారు. ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పద్మావతి, సర్పంచ్ ఇండ్ల సుధాకర్, హౌసింగ్ ఏఈ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్, మండల ఏఓ శైలజ, పీహెచ్‌సీ వైద్యులు శ్రీనివాసులు, వీఆర్వో బాలకోటయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

బిట్రగుంట: బోగోలు మండలం కొండబిట్రగుంటకు చెందిన రావి వెంకటేశ్వర్లు (54) బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మంగళవారం సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో పొలాలకు సమీపంలో జరిగింది. స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆత్మహత్యకు సంబంధించి స్పష్టమైన కారణాలు తెలియలేదు. మృతుడి సోదరుడు రావి శీనయ్య ఫిర్యాదు మేరకు బిట్రగుంట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఉరేసుకుని టిప్పర్ డ్రైవర్ ఆత్మహత్య



మర్రిపాడు: మండలంలోని పోలిరెడ్డిపల్లి సమీపంలో పొలాల వద్ద ఓ టిప్పర్ డ్రైవర్ మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కంపసముద్రం రిజర్వాయర్ వద్ద నిర్మాణ పనుల్లో భాగంగా వైఎస్సార్ జిల్లా బ్రహ్మంగారిమఠం మండలం ఇరసవంచ గ్రామానికి చెందిన మద్దల కేశవ (37) టిప్పర్ డ్రైవర్‌గా ఉన్నాడు. మంగళవారం మధ్యాహ్నం ఇంటికి ఫోన్ చేసి భార్యతో మాట్లాడాడు. అనంతరం పోలిరెడ్డిపల్లి సమీపంలో నుంచి మట్టి తోలుతున్న ప్రాంతం వద్ద ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సహచర టిప్పర్ డ్రైవర్లు గుర్తించి మర్రిపాడు పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మద్దల కేశవకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరిలోని ఆస్పత్రికి తరలించారు.

పాముకాటుకు మహిళ మృతి



శేషమ్మ మృతదేహం

అల్లూరు: పాము కాటుకు గురై మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని గోగులపల్లి పంచాయతీ చంద్రశేఖరపురంలో మంగళవారం జరిగింది. అల్లూరు ఎస్సై పి. శ్రీనివాసులరెడ్డి సమాచారం మేరకు.. చంద్రశేఖరపురం గ్రామానికి చెందిన పురిణి శేషమ్మ (57) ఉదయం 6 గంటలకు తన ఇంటి ప్రాంగణంలో గడ్డి, రాళ్లు తొలగిస్తూ పరిసరాలను శుభ్రం చేస్తుండగా పాముకాటుకు గురైంది. స్థానికులు ఆమెను అల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రిడ్జి నిర్మాణంపై పరిశీలన



పిల్లాపేరు వాగును పరిశీలిస్తున్న పీఆర్ డీఈ

కొండాపురం: మండలంలోని భీమవరప్పాడు సమీపంలోని పిల్లాపేరు వాగు మీద బ్రిడ్జి నిర్మాణం చేసేందుకు గతంలో పనులు మంజూరయ్యాయి. వాగు ప్రాంతాన్ని మంగళవారం పంచాయతీ రాజ్ డీఈ సుబ్బారెడ్డి, జేఈ ప్రసాద్, పీఎంసీ కోఆర్డినేటర్ ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ గతంలో రూ. 2.83 కోట్ల నిధులతో బ్రిడ్జి నిర్మాణానికి పనులు మంజూరయ్యాయన్నారు. కాంట్రాక్టరు ప్రస్తుతం ఆ పనులు చేయాలంటే అధికంగా ఖర్చు అవుతుందని, చేయలేనని తెలిపారన్నారు. అయితే గ్రామస్తుల కోరిక మేరకు ప్రాజెక్ట్ వెనక్కుపోతే మళ్లీ రాదని కాంట్రాక్టర్‌తో మాట్లాడుతున్నామన్నారు.

డీడీఓ ఉత్తర్వులు రద్దు

- డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్



వైద్యశాలలో రికార్డులు పరిశీలిస్తున్న డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్

ఉదయగిరి: ఉదయగిరి సీహెచ్‌సీ వైద్యాధికారి రవీంద్రనాథ్ ఠాగూర్‌కు ఇటీవల ఇచ్చిన డీడీఓ ఉత్తర్వులు రద్దు చేస్తున్నట్లు డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్ ప్రకటించారు. సోమవారం వైద్యశాల ఎదుట వైద్యులు, సిబ్బంది ఠాగూర్‌కు ఇచ్చిన డీడీఓ ఉత్తర్వులు రద్దు చేయాలని ఆందోళన చేయడం తెలిసిందే. దీంతో మంగళవారం వైద్యశాలకు చేరుకున్న డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్ సిబ్బంది వద్ద వివరాలు సేకరించి నిర్ణయం తీసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఠాగూర్‌పై వచ్చిన ఆరోపణలు వాస్తవమేనన్నారు. తదుపరి విధుల్లో చేరిన అనంతరం ఆయనపై అభియోగాలు వచ్చినా తమ దృష్టికి రాలేదన్నారు. ఈ విషయమై వైద్యశాలలో వైద్యులు, సిబ్బందితో మాట్లాడి వారివద్ద నుంచి లిఖిత పూర్వకంగా అభిప్రాయాలు తీసుకుని ఉన్నతాధికారులకు నివేదిక రూపంలో అందజేసి తగు చర్యలు తీసుకుంటామన్నారు. పేదలకు మెరుగైన వైద్యసేవలందించడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమన్నారు. జిల్లాలోని అన్ని వైద్యశాలల్లో వైద్యులు, సిబ్బంది కొరత లేదన్నారు. త్వరలో ఉదయగిరి వైద్యశాలలో సిజేరియన్లు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయనున్నట్లు ఆయన తెలిపారు. అంతకు ముందు వైద్యశాలలోని అన్ని విభాగాలను పరిశీలించి సిబ్బంది హాజరు పట్టీలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అనీస్‌సల్మా, సింధూర, ఝాన్సీ, సిబ్బంది పాల్గొన్నారు.

141వ నంబరు ఎల్‌సీ గేటు పరిశీలన



రైల్వేగేటు వద్ద అండర్ బ్రిడ్జి నిర్మించే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఏడీఈఎన్ అపూర్వ వశిష్ఠ, తహసీల్దార్

బిట్రగుంట: బోగోలులోని 141వ నంబరు రైల్వే ఎల్‌సీ గేటును రైల్వే ఏడీఈఎన్ అపూర్వ వశిష్ఠ, తహసీల్దార్ లక్ష్మీనారాయణ మంగళవారం పరిశీలించారు. లెవల్ క్రాసింగ్ గేటు స్థానంలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించే ప్రతిపాదనలో భాగంగా ఏడీఈఎన్, తహసీల్దార్‌లు రైల్వే గేటును, అండర్ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైల్వేల ఆధునికీకరణ, రైళ్ల వేగాన్ని పెంచే చర్యల్లో భాగంగా 2027 నాటికి ఎల్‌సీ గేట్ల స్థానంలో రైల్వే బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందులో భాగంగా 141 నంబరు రైల్వే ఎల్‌సీ గేటు వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణానికి రైల్వేశాఖ చర్యలు చేపట్టడంతో రెవెన్యూ శాఖ తరపున స్థలాన్ని పరిశీలించినట్లు వివరించారు. ఆర్డీఓ ఆదేశాల మేరకు స్థలాన్ని గుర్తించి సర్వే నివేదికను తయారు చేస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్ వెంట సర్వే, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

సచివాలయాలతో సుపరిపాలన



మాట్లాడుతున్న ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమల్లోకి తెచ్చిన గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు సుపరిపాలన అందుతుందని ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని వాశిలిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ పథకం రావాలన్నా, కనీసం దరఖాస్తు చేసుకోవాలన్నా మండల కేంద్రాల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వచ్చేదన్నారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, మండల వ్యవసాయాధికారి కిషోర్‌బాబు, ఉప సర్పంచ్ పద్మయ్యనాయుడు, పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు బొడ్డు గిరినాయుడు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేగంగా సుస్థిర అభివృద్ధి సర్వే

ఉదయగిరి: సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సర్వేను మండలంలోని వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, వైద్య ఆరోగ్య కార్యకర్తలు సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ సూచించారు. ఆయన మంగళవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సిబ్బంది గ్రామాలలో ఇంటింటికీ తిరిగి 0–5 ఏళ్లలోపు, 6–19 ఏళ్లలోపు వారిని, గర్భిణులను గుర్తించి వివరాలు సేకరించాలన్నారు.

గరుడ వాహనంపై రాములోరి వైభవం



ఆత్మకూరు: పట్టణంలోని కోదండ రామాలయంలో ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి గరుడ వాహన సేవ నిర్వహించారు. రాములోరి ఉత్సవమూర్తిని గరుడ వాహనంపై వివిధ పుష్పాలు, గజమాలలతో అలంకరించి మేళతాళాలతో బాణసంచా వేడుకలతో గ్రామోత్సవం నిర్వహించారు. డీజే నృత్యాలు చేస్తూ యువత ఊరేగింపు ముందుకు సాగింది. తమ ఇళ్ల ముంగిటకు వచ్చిన స్వామివారికి భక్తులు నైవేద్యాలు సమర్పించారు.

డీసీపల్లిలో 849 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో మంగళవారం 849 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 885 బేళ్లు రాగా 849 బేళ్లను విక్రయించామన్నారు. మిగిలిన 36 బేళ్లలో 16 నోసేల్, 11 నోబిడ్, 9 సీఆర్‌గా గుర్తించామన్నారు. వేలంలో 1,14,131 కిలోల పొగాకు విక్రయించగా రూ.2,23,38,522 వ్యాపారం జరిగింది. కిలోకు గరిష్ట ధర రూ.200, కనిష్ట ధర రూ.185 లభించింది. సగటున కిలో రూ.195.73 పలికింది. వేలంలో 8 కంపెనీల వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలలో విద్యార్థులకు వైద్యశిబిరం



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఉదయగిరి: పట్టణంలోని మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ, మెరిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం వైద్యశిబిరం జరిగింది. ఈ సందర్భంగా వైద్యులు మాశిలామణి, కోటేశ్వరరావు, లీలావతి, వినయ్, వినోద్ విద్యార్థులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల డీన్ కరుణసాగర్, మెరిట్స్ కళాశాల ప్రిన్సిపల్ మనోజ్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో పోషకాహారం



గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సౌజన్య

దగదర్తి (బిట్రగుంట): చిరుధాన్యాలతో పోషకాహారం లభిస్తుందని దగదర్తి సెక్టార్ సూపర్‌వైజర్ సౌజన్య తెలిపారు. దగదర్తి మండలం ఉలవపాళ్ల అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ్ వారోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం ఆవశ్యకత, చిరుధాన్యాల విశిష్టత, తల్లీబిడ్డల సంరక్షణ, గర్భిణులు, బాలింతల్లో పోషకాహారలోపం కారణంగా ఎదురయ్యే సమస్యలు, తదితర అంశాలపై అవగాహన కలిగించారు. అందుబాటులో ఉన్న ఆకు కూరలు, ఆహార పదార్థాలతో పోషకాహార లోపాన్ని నివారించడం, వ్యాక్సిన్ల ప్రాముఖ్యతను కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, మహిళా సంరక్షణ కార్యదర్శి మౌలిక, ఎంపీటీసీ సభ్యురాలు చిన్నమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు జె రమాదేవి, మందా నిర్మల, ఎం. వసంతమ్మ, కే సుబ్బరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి వేడుకలకు అంకురార్పణ



శేష వాహనంపై తిరువీధుల్లో ఊరేగుతున్న సీతారామచంద్రస్వామి

ఆత్మకూరురూరల్: మండలంలోని గండ్లవేడులో శ్రీరామనవమి వేడుకలకు మంగళవారం తెల్లవారుజామున పండితుల మంత్రోచ్ఛారణల నడుమ అంకురార్పణ చేశారు. సీతా సమేతుడైన రామచంద్ర స్వామి తిరువీధుల్లో శేషవాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనం ఇచ్చారు. దక్షిణవీధి వారు ఉభయకర్తలుగా వ్యవహరించి కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు ప్రసాద్ శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నిషేధిత జాబితా నుంచి విముక్తి కల్పించండి

- మంత్రి కాకాణికి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తి




మంత్రి కాకాణికి సమస్య తీవ్రతను వివరిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: కావలి పట్టణంలోని పలు ప్రాంతా ప్రజలు తాత ముత్తాల నుంచి తరతరాల ఆస్తులకు యజమానులైనప్పటికీ 2018లో చంద్రబాబు ప్రభుత్వం చేసిన దాష్టీకానికి ఆర్థికంగా, మానసికంగా క్షోభ పడుతున్నారని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దృష్టికి కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తీసుకెళ్లారు. నెల్లూరులోని మంత్రి కాకాణి నివాసంలో మంగళవారం ఎమ్మెల్యే కలిసి స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇళ్లు, ఇళ్ల స్థలాలు నిషేధిత సమస్యను వివరించారు. కావలి పట్టణంలోని వెంగళరావునగర్, తుఫాన్ నగర్, ఇందిరానగర్, జనతాపేట, వైకుంఠపురం తదితర ప్రాంతాల్లో తరతరాలుగా ఉంటున్న నివాస గృహాలను, ఇంటి ఆస్తులను (సుమారు 7 వేల మందికి చెందిన) 2018 లో అధికారంలో ఉన్న చంద్రబాబు ప్రభుత్వం నిషేధిత భూముల జాబితాలో పెట్టారని మంత్రికి ఎమ్మెల్యే విశ్లేషించారు. అప్పటి నుంచి వాటిని పిల్లలు చదువులకు, పెళ్లిళ్లకు, ఇతర ఆర్థిక అవసరాలకు అమ్మకాలు చేయాలన్నా, అప్పులు తీసుకోవాలన్నా, ఆస్తులు పంచుకోవాలన్నా రిజిస్ట్రేషన్లు కావడం లేదని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కావలి పట్టణ ప్రజలు ఎంతో మంది అధికారులకు ఎన్ని రకాల అర్జీలు ఇస్తున్నా.. సమస్య పరిష్కారం కావడం లేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కావలి పట్టణ ప్రజల ఇళ్లు, నివాస గృహాలు, ఇంటి స్థలాలు తదితర ఆస్తులను నిషేధిత జాబితాలో నుంచి తొలిగించి, వారి కుటుంబాల్లో సంతోషం నింపాలని మంత్రికి ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి సత్వరమే సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

సేవా కార్యక్రమాలకు సహకరించండి

- ప్రభుత్వ ఆసుపత్రిలో నిరంతర అన్నదానం



మాట్లాడుతున్న పరమేశ్వర రెడ్డి

ఆత్మకూరు: ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో 31వ తేదీ శుక్రవారం నుంచి రోగులకు వారి సహాయకులకు, అవుట్ పేషెంట్లకు నిరంతరం ఉచిత భోజన సౌకర్యం కల్పించనున్నట్లు శ్రీసాంబశివా చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు కంచి పరమేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం వెంకటేశ్వర మినీ కాన్ఫరెన్స్ హాలులో విలేకర్లతో మాట్లాడారు. ఆత్మకూరు పట్టణానికి చెందిన ఆయన వ్యాపార రీత్యా మూడు దశాబ్దాలుగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. అయితే సొంత ఊరికి ఏదైనా చేయాలన్న సంకల్పంతో స్థానిక ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, కలెక్టర్ కేవీఎస్ చక్రధర్‌బాబును సంప్రదించి వారి అనుమతితో ప్రభుత్వ ఆసుపత్రిలో నిరంతర ఉచిత భోజన సౌకర్యం ఏర్పాటుకు సన్నద్ధమైనట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత హెచ్‌ఎం కేవీ శేషారెడ్డి, నారాయణ రావు, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ గ్రామసభలు

సీతారామపురం: మండలంలోని అయ్యవారిపల్లి, దేవరాయసూరాయపల్లి, బాలాయపల్లి, బసినేనిపల్లి గ్రామాల్లో మంగళవారం సామాజిక బృంద సభ్యులు గ్రామసభ నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులపై చర్చించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చింతలరెడ్డి సుబ్బారెడ్డి, ఎంపీపీ చింతలరెడ్డి పద్మావతి, సర్పంచ్‌లు పల్లె విజయమ్మ, దుర్గాప్రసాద్, వెంకటరెడ్డి, వెంకటసుబ్బయ్య, ఎస్సార్‌పీ అచ్యుతరావు ఆడిట్ బృంద సభ్యులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు రైతుబజార్ వ్యాపారుల వినతి

కావలి: పట్టణంలోని రైతుబజార్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని స్థానిక ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి అక్కడి వ్యాపారులు మంగళవారం విజ్ఞప్తి చేశారు. అక్కడే ఉన్న రైతుబజార్ ఎస్టేట్ అధికారిణి స్వరూపతో రైతుబజార్‌లో కూరగాయలు అమ్మకాలు చేసే వారికి, కొనుగోలుదారులకు ఇబ్బందులు లేకుండా శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం ఎమ్మెల్యేను కూరగాయలు వ్యాపారులు శాలువా కప్పి సత్కరించారు.